క్లుప్తంగా

నిందితులపై కేసు నమోదు చేయాలి



ఎస్‌ఐకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సదుం: మండలంలోని మద్దెలవారిపల్లెలో దళితునిపై దాడిచేసిన నిందితులపై కేసు నమోదు చేయాలని దళిత సంఘం నాయకులు ఎస్‌ఐ షేక్‌షావలికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. భూ వివాదాల నేపథ్యంలో ఈనెల 12న దళితుడైన సురేంద్రపై దాడి చేశారని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో ధరణ్‌కుమార్, శ్రీకాంత్, మల్లికార్జున, సుభాష్, లోకనాథం పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి



సుధీర్‌రెడ్డిని కలిసిన ఎంపీపీ

సదుం: మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ధనుంజయరెడ్డికి వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. ఎంపీపీ ఆయనను బూరగమందలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గణేష్ రెడ్డి, బాగిరెడ్డి, హనుమంతరెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం

కాణిపాకం: హైందవ శంఖారావం పేరుతో జనవరి 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ సభ్యుడు వేలు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, దేవతా మూర్తులు, దేవాలయాలను కాపాడుకునే విషయంపై రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. హిందూబంధు జనులు పెద్ద సంఖ్యలో పాల్గొని సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటుకు సంఘీభావం తెలపాలని కోరారు.

ఈరోజు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కుప్పం: కుప్పం ప్రాంత అభివృద్ధి అథారిటీ(కడా) ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు కడా కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలియజేసింది.

పలమనేరు, కుప్పంలో కరెంటు కట్

పలమనేరు: మహదేవపురం–పలమనేరు లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో కరెంటు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు స్థానిక ట్రాన్స్‌కో డీఈ చిన్నబ్బ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పలమనేరు, కుప్పం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

'మురుగు' దరువు

పెద్దచెరువు కథ కంచికేనా..?

- గతంలోనే ఆగిన డైవర్షన్ చానెల్ నిర్మాణ పనులు
- రూ.6కోట్లతో కట్ట సుందరీకరణ పనుల ఊసేలేదు
- వర్షాలకు కంపు కొడుతున్న పెద్దచెరువు కట్ట ప్రాంతం
- గత ప్రభుత్వ పాలనలో చెరువు సుందరీకరణకు కార్యాచరణ
- అమరన్నా..! హామీ నెరవేర్చన్నా అంటున్న ప్రజానీకం



చెరువులోకి మురుగునీరు రాకుండా గత ప్రభుత్వంలో కాలువ సిద్ధం చేస్తున్న దృశ్యం(ఫైల్)



మురుగునీటితో దుర్గంధభరితమైన పలమనేరు పెద్ద చెరువు

పలమనేరు: పల్లవుల కాలం నాటి స్థానిక పెద్దచెరువుకు గత ప్రభుత్వ పాలనలో మహర్దశ ప్రాప్తిస్తుందని పట్టణ ప్రజలు భావించారు. ఆ దిశగా అప్పట్లో చెరువు సుందరీకరణకు ప్రభుత్వం పూనుకుంది. పట్టణంలోని మురుగు నీరు చెరువులో చేరకుండా చేసేందుకు కార్యాచరణకు ఉపక్రమించింది. ఇందుకుగాను డైవర్షన్ చానెల్ పనులకు ఆమోదించి 14వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.5కోట్లు మంజూరు సైతం చేసింది. అలాగే టెండర్ల ప్రకియ సైతం అప్పట్లోనే మొదలైంది. మున్సిపల్ నిధులతో ప్రత్యామ్నాయ కాలువ (తాత్కాలికమైంది) పనులు సైతం అప్పట్లోనే మొదలయ్యాయి. దీంతోపాటు చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, కలర్ లైటింగ్, చెరువు మధ్యలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తయారు చేసేందుకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అధికారుల ద్వారా రూ.6 కోట్లతో ప్రభుత్వానికి అంచనాలను పంపారు. ఇదంతా పూర్తయితే చెరువులోకి పట్టణ మురుగునీరు చేరకుండా మళ్లించి కాలుష్యరహిత చెరువుగా మార్చాలన్నదే ప్రధాన లక్ష్యం. తద్వారా సుందరీకరణతో పట్టణానికి పెద్దచెరువు మణిహారంగా మారుతుందని పట్టణ ప్రజలు భావించారు. అయితే ఆపై కోవిడ్ కష్టాలు, మళ్లీ సాధారణ ఎన్నికలు రావడంతో ఈ పనులు ఆగాయి. అయితే మొన్నటి ఎన్నికల్లో పలమనేరు పెద్ద చెరువు సమస్యపై తమ ప్రభుత్వం అధికారంలోకి దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి కార్యాచరణకూ పూనుకోలేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు మురుగు నీరంతా చెరువుకు చేరి మరింత దుర్గంధం చిమ్ముతోంది. కట్టపై చెన్నై–బెంగళూరు హైవేలో వెళ్లేవారు సైతం ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

అమరన్న మంత్రిగా ఉన్నప్పుడే పరిష్కారం కాని సమస్య ఇది!

పట్టణంలోని కొత్తపేట నుంచి వచ్చే మురుగునీరు మొత్తం గుండుబావి, ఆర్‌అండ్‌బీల వద్ద నుంచి చెరువులో చేరేది. దీంతో చెరువు నీరు కలుషితమై దుర్వాసన చిమ్మేది. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు దశాబ్దాలుగా పాలకులను కోరుతూనే ఉన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పలమనేరుకు ప్రాతినిధ్యం వహిస్తూ పరిశ్రమలశాఖా మంత్రిగా పనిచేసిన అమరనాథ రెడ్డి సైతం చెరువు సమస్యను పరిష్కరించలేకపోయారు. ఆపై అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవ చూపింది. రూ.5కోట్లతో చెరువు అభివృద్ధి, శాశ్వత పరిష్కారానికి ఈటీపీ(ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), రూ.6 కోట్లతో చెరువు కట్ట సుందరీకరణకు అంచనాలను సైతం సిద్ధం చేసింది. పనులు చేసేందుకు టెండర్ల ప్రక్రియను సైతం మొదలు పెట్టింది. ఆపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, ఈ సమస్యను అధికారంలోని పెద్దలు ఇప్పటికీ పట్టించుకోకపోవడంతో పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువులోకి వ్యర్థాలు వెళ్లకుండా చేయాలి

పట్టణంలోంచి చెరువులోకి మురుగునీరు చేరకుండా చెరువుకు తూర్పు వైపు తాత్కాలికంగా కాలువను నిర్మించారు. దీన్ని చెరువు కట్టకింద నుంచి పడమర వైపు ఉన్న మొరవ ద్వారా బొమ్మిదొడ్డి సమీపంలోని కౌండిన్యలోకి మళ్లిస్తున్నారు. చెరువులో కొంత నీరు తగ్గాక డైవర్షన్ చానెల్ పనులు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తి చేస్తే దుర్గంధం నుంచి చెరువుకు విముక్తి కలుగుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ పనులకు పూనుకుని చెరువుకు పూర్వవైభవం తేవాలని కోరుతున్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

రామకుప్పం: వైఎస్సార్ సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి అల్లుడు సోమశేఖర్ రెడ్డి ఆదివారం హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకందగానిపల్లెకు చేరుకుని సోమశేఖర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం చంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్సీ భరత్ ఫోన్‌లో చంద్రారెడ్డిని పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వర్షాలకు నేలకొరిగిన వరి



మతుకువారిపల్లెలో నేలకొరిగిన వరి పంట

కల్లూరు(పులిచెర్ల): తుపాను మూలాన కురిసిన వర్షాలకు చేతికొచ్చిన వరి పంట నేలకొరిగి నష్టపోయామని మతుకువారిపల్లె పంచాయతీ రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట నష్టపోయిన తమను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తే పోరాటం

- మాట తప్పిన కూటమి ప్రభుత్వం
- కరెంట్ చార్జీల బాదుడుకు రంగం సిద్ధం చేసిన వైనం
- జిల్లా సీపీఐ నాయకుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు నాగరాజు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు సామాన్యులపై భారం మోపుతూ కరెంట్ చార్జీలను పెంచడం శోచనీయమని సీపీఐ జిల్లా నాయకులు నాగరాజు విమర్శించారు. నియోజకవర్గ మాజీకార్యదర్శి చెన్నకేశవుల ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. ముఖ్యంగా కరెంట్ చార్జీల విషయంలో వారికి ఎదురుదెబ్బ తప్పదన్నారు. ట్రూ అప్ చార్జీల పేరిట రూ.8,114 కోట్ల భారం ప్రజలపై ఇప్పటికే మోపిందన్నారు. ఇప్పుడున్న ట్రూఅప్ చార్జీలను మరింత పెంచే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. దీంతోపాటు స్మార్ట్‌మీటర్లను పెట్టి ప్రజలను నిలువుదోపిడీ చేసేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఇదే గనుక జరిగితే తమ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పూనుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

రామకుప్పం: మండలంలోని ఆరిమానుపెంటలో మంగళవారం కుప్పం కేసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బాలాజీ తెలిపారు. ఈ శిబిరంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు చేస్తారని, దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తులసీనాథం నాయుడు దంపతులకు సత్కారం



పలమనేరు: పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులను కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో జానుమద్ది కళాపీఠం ఆదివారం నిర్వహించిన సమావేశంలో భాషా పురస్కారాలతో ఘనంగా సన్మానించింది. జానుమద్ది హనుమశాస్త్రి శతజయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని అక్కడ నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్, ఆవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నిర్వాహకులు విజయభాస్కర్ తదితరుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని వారు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

ఆగిన మరుగుదొడ్ల నిర్మాణం



ఆగిపోయిన మరుగుదొడ్ల పనులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో నిధుల కొరతతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పాఠశాలలో 406 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2012–13 సంవత్సరంలో ప్రభుత్వం రూ.70 వేల నిధులను మంజూరుచేసి మరుగుదొడ్లు నిర్మించింది. అయితే వాటికి నీటి సౌకర్యం లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో గత సంవత్సరం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో పనులు చేపట్టారు. ఆ నిధులు చాలకపోవడంతో మరుగుదొడ్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని మరుగుదొడ్ల పనులను పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

యువతకు వాల్మీకి మహర్షి ఆదర్శం



నడింపల్లెలో వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్ ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దపంజాణి: వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని యువత సన్మార్గంలో నడవాలని బీసీ నాయకుడు దొరస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ నడింపల్లెలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో దొరస్వామి మాట్లాడుతూ, కులమతాలకతీతంగా వాల్మీకి మహర్షిని పూజించాలని, మహర్షి చూపిన సన్మార్గంలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. వాల్మీకి రాసిన రామాయణం మనిషి పరిపూర్ణ వ్యక్తిగా మారేందుకు దోహదం చేస్తుందన్నారు. సమాజంలో ఇప్పటికీ సభ్యత, సంస్కారం బతికి ఉన్నాయంటే అది ఆయన చలవేనన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆ తర్వాత వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని సుందరంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి పలు గ్రామాలలో బ్యాండు వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు శంకర్ కుమార్, రాధా, రాజశేఖర్, గంగాధర్, సురేంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల స్వైర విహారం



కల్లూరు నాలుగు రోడ్లలో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

కల్లూరు(పులిచెర్ల): మేజరు పంచాయతీ కల్లూరులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే నాలుగు రోడ్ల కూడలి ప్రాంతంలో వీధికుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చే పోయే వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. పంచాయతీ అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ, బీటీ రోడ్లకు శంకుస్థాపన

గుడిపాల: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేలరాంబట్టి, పానాటూరు, రామభద్రాపురం, బసవాపల్లె, 197రామాపురం పంచాయతీల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆదివారం సీసీరోడ్లు, బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, రూ.70లక్షల విలువైన సీసీ, బీటీరోడ్లు, శ్మశాన ప్రహరీ నిర్మాణాలకు భూమిపూజ చేశామన్నారు. గుడిపాలను స్మార్ట్ మండలంగా తీర్చిదిద్దుతానన్నారు. నియోజకవర్గానికి 250 క్యాటిల్ షెడ్లు మంజూరయ్యాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శివరాజన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, నాయకులు హేమాద్రి, హరిప్రసాద్, సుమతి, మధుసూదన్‌నాయుడు, మురళి పాల్గొన్నారు.

టీచర్ గాయత్రీదేవికి డాక్టరేట్



గాయత్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్: గుడిపాల మండలం చిత్తపార జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న కరణం గాయత్రీదేవికి తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ఆ వర్సిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ పి.హరిపద్మరాణి పర్యవేక్షణలో 'రీడింగ్ గ్రేడెడ్ మెటీరియల్స్ ఇన్ ఇంగ్లిష్: ఏ కేస్ స్టడీ ఆఫ్ ఛాలెంజస్ ఫేస్డ్ బై గవర్నమెంట్ స్కూల్ చిల్డ్రన్ ఎట్ ద సెకండరీ లెవెల్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆమె ఓవైపు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే, మరో వైపు తన పరిశోధనలను పూర్తి చేసి త్వరలో యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకోనున్నారు. ఆమెను హరిపద్మరాణితోపాటు డీఈఓ దేవరాజులు, డీవైఈఓ చంద్రశేఖర్, గుడిపాల ఎంఈఓ–1 హసన్‌బాషా, ఎంఈఓ 2 గణపతి, చిత్తపార జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎంఆర్ శరవణ, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

పంట మార్పిడితో ఉత్తమ ఫలితాలు

- భూసారం పెరిగి అధిక దిగుబడులు
- రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గే అవకాశం
- ఏటా ఒకే పంట సాగు చేస్తే నేలకు, రైతుకు నష్టం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



లక్కనపల్లె వద్ద దుక్కులు దున్నుతున్న రైతు



రామనపల్లె వద్ద పంట సాగు కోసం దుక్కులు దున్నుతున్న రైతు

బైరెడ్డిపల్లె: ఒకే పొలం..ఒకే రకమైన పంట..ఏటా ఇదే పద్ధతిలో సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోతున్నాయి. పైరు ఎదుగుదల లోపించి చీడపీడల ఉధృతి అధికంగా ఉండడంతో దిగుబడి అంతంత మాత్రంగానే వస్తోంది. దీంతో పంట మార్పిడి చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అత్యధిక లాభం పొందే అవకాశం ఉంది.

ఒకే పంట సాగుతో కలిగే నష్టాలు

- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల ఆలోతు వరకు ఉన్న పోషకాలు మాత్రమే వినియోగించుకుంటాయి.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు మొక్కల బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గిపోతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంటలో కూడా నాణ్యత ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది.

పంట మార్పిడితో లాభాలు

పంట మార్పిడి విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. రైతులు ఏటా రబీ సీజన్‌లో అధిక శాతం ఒకే పంటను సాగు చేస్తున్నారు. చలికి పండే పంటలైన మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు తప్ప మరే పంటలు సాగు చేయడం లేదు. దీంతో చీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనికి నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమం. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు ఒకసారి అనుభవంలోకి వస్తే ఆ విధానమే కొనసాగిస్తారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పంట మార్పిడి విధానంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

పంట మార్పిడితో అధిక దిగుబడి



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన భూములు నిస్సారంగా మారి వ్యవసాయంలో ఆశించిన ఫలితాలు ఉండడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పంటల మార్పిడి వలన అధిక దిగుబడులు పొందవచ్చు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు సాగుచేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము కట్టెలు వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీని వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్లో రాగులు, మినుములు, సజ్జ వంటి అపరాల పంటలకు మంచి గిరాకీ ఉన్నందున ఈ పంటలు సాగు చేసుకోవచ్చు.

–గీతాకుమారి, వ్యవసాయశాఖాధికారిణి, బైరెడ్డిపల్లె

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువ లోతు వేర్లు ఉన్న పైరు, తక్కువ లోతు గల పంట ఒక దాని తర్వాత ఒకటి సాగు చేయాలి.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒక దాని తర్వాత ఒకటి సాగు చేయాలి.